గుంతలమయం

- అధ్వానంగా రచ్చమల్లపాడు రహదారి
- వాహన రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- ఆర్టీసీ బస్సు సర్వీసును రద్దు చేసిన అధికారులు
- రోడ్డును వెంటనే పూర్తి చేయాలంటున్న ప్రయాణికులు





గుంతలమయమైన రచ్చమల్లపాడు, మండాది రహదారి

వెల్దుర్తి: మాచర్ల, మండాది గ్రామాల మధ్య జాతీయ రహదారి 565 ఎన్‌హెచ్ నుంచి రచ్చమల్లపాడు వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 25 ఏళ్ల కిందట ఈ రహదారిలో తారు రోడ్డు వేశారు. ఆ తర్వాత క్రమేపి గుంతలమయం కావడంతో వాహనదారులు అనేకసార్లు ప్రమాదాలకు గురయ్యారు. ఆర్టీసీ అధికారులు ఐదేళ్ల కిందటే బస్సును కూడా ఈ రూట్‌లో రద్దు చేశారు. విద్యార్థుల కోసం ఉదయం 8గంటలకు, సాయంత్రం మాత్రమే ఆర్టీసీ బస్సు తిరుగుతోంది. మిగిలిన సమయంలో ప్రయాణికులకు ఆటోలే దిక్కు. ప్రయాణికులతో నిండితేనే ఆటోలను డ్రైవర్లు తీస్తున్నారు. లేకపోతే కదిలే వరకు వేచి చూడాల్సిందే. అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆగిన రోడ్డు నిర్మాణం

2017లో బోదిలవీడు నుంచి శ్రీరాంపురం తండా, రచ్చమల్లపాడు నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5.40 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టి బోదిలవీడు నుంచి రచ్చమల్లపాడు గ్రామం వరకు తార రోడ్డు నిర్మించారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో రచ్చమల్లపాడు నుంచి జాతీయ రహదారి వరకు 4 కిలోమీటర్ల రోడ్డు పనులు నిలిపివేయడంతో.. ఆ నిధులు రద్దయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రహదారిని పట్టించుకున్న నాథుడే లేడు.

అదనపు దూరం

రాత్రిళ్ల ఈ మార్గంలో ప్రయాణించాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. శ్రీరాంపురం తండాకు వెళ్లే వారు మండాది, బోదిలవీడు మీదుగా 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టాలని రచ్చమల్లపాడు, శ్రీరాంపురం తండా వాసులు కోరుతున్నారు.

ఆటోలు తిప్పాలంటే భయమేస్తుంది



ఈ రోడ్డులో ఆటోలు తిప్పాలంటే భయంగా ఉంది. ఏ గుంతలో పడి ప్రమాదం జరుగుతుందోనని నిదానంగా వెళ్తున్నాం. టైర్లు తరచూ పంక్చరై..ఇబ్బందులు పడుతున్నాం.. రోడ్డును మంజూరు చేసి, త్వరగా పూర్తి చేయాలి.

– తోట బాల కోటయ్య, ఆటో డ్రైవర్, రచ్చమల్లపాడు

మరమ్మతులు చేపట్టాలి



మాచర్ల, మండాది గ్రామాల మధ్య జాతీయ రహదారి నుంచి రచ్చమల్లపాడు వరకు 4 కిలోమీటర్ల రోడ్డుకు వెంటనే నిధులు కేటాయించాలి. రాత్రిళ్ల ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– పోసాని వెంకటేశ్వర్లు, రచ్చమల్లపాడు

వెంటనే నిధులు కేటాయించాలి



గత 15 ఏళ్ల నుంచి ఈ గుంతల రోడ్డులోనే ప్రయాణిస్తున్నాం. గత కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కు వెళ్లిపోయాయి. రోడ్డు వెంటనే పూర్తి చేయాలి. రోడ్డు సమస్యకు పరిష్కారం చూపాలి.

– గారపాటి వెంకట్రామయ్య, రచ్చమల్లపాడు

ఆర్టీసీ బస్సు రద్దు చేశారు



మాచర్ల నుంచి రచ్చమల్లపాడు, శ్రీరాంపురం తండా మార్గంలో ఆర్టీసీ బస్సు రద్దు చేశారు. విద్యార్థుల కోసం ఒక సర్వీసు నడుపుతున్నారు. రోడ్డు గుంతలమయం కావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

– అనుముల రామస్వామి రెడ్డి, రచ్చమల్లపాడు

క్లుప్తంగా

హిందువులపై దాడులు దుర్మార్గం



పిడుగురాళ్ల: రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న దాడులను హిందూ చైతన్య వేదిక, విశ్వ హిందూ పరిషత్, వానర సేన సభ్యులు గురువారం ఖండించారు. పట్టణంలోని హిందు చైతన్య వేదిక కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రుని స్వామి ఉత్సవాల్లో అల్లరి మూకలు రాళ్ల దాడి చేశాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి దాడులపై దృష్టి సారించి, పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాయచోటి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

పిడుగురాళ్ల: స్థానిక పుర ప్రజలు ఇంటి పన్ను, కొళాయి పన్ను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ గురువారం తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు బకాయిలు సచివాలయాలు, మున్సిపల్ కార్యాయంలో చెల్లించి, నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

'వర్క్ ఫ్రం హోం' సర్వే

మాచర్ల: పట్టణంలో వర్క్ ఫ్రం హోమ్ సర్వే గురువారం నిర్వహించారు. 16 సచివాలయాల ఉద్యోగులు 18 నుంచి 50 ఏళ్లలోపు ఉన్నవారి వివరాలు తెలుసుకుని, నమోదు చేసుకున్నారు. రెండు రో జులుగా ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు.

రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలి

మాచర్ల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణానికి సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఆర్.బాలాజీ నాయక్ తెలిపారు. హౌసింగ్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 31వ తేదీ లోపు ప్రతి ఒక్కరూ సొంతింటి నిర్మాణ రుణం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రూ.2.50 లక్షల రుణం మంజూరు చేస్తుందని వెల్లడించారు. సొంత స్థలం ఉన్నా ప్రభుత్వం ఇచ్చిన పట్టా ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరో నాలుగేళ్ల పాటు గృహ నిర్మాణానికి రుణాలు మంజూరు చేసే అవకాశం లేదన్నారు. ఈ నెలాఖరులోపు ఇంటి నిర్మాణ రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాచర్ల ఏఈ సాతులూరి మరియదాసు, దుర్గి మండల ఏఈ చింతపల్లి లక్ష్మీ ఉన్నారు.

9న సాయిబాబా మందిర వార్షికోత్సవాలు



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న షిర్డి సాయిబాబా మందిరం 26వ వార్షిక వేడుకలు ఈ నెల 9వ తేదీ నుంచి జరగనున్నాయి. దీనిలో భాగంగా గురువారం మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. భక్తులు విశేషంగా పాల్గొని, పూజలు చేశారు. శుక్రవారం హోమం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని మందిరం చైర్మన్ శ్రీరాం వెంకట శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, ఆలయ పూజారి తెలిపారు.

నేడు పీ-4 విధానంపై శిక్షణ

మాచవరం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పేదరికంలో దిగువనున్న 20 శాతం కుటుంబాలు ఆర్థిక ప్రమాణాలు, సామాజిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు నిమిత్తం పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) సర్వే చేపట్టేందుకు సచివాలయ సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు తెలిపారు. ఈ నెల 8 నుంచి 18 లోగా సర్వే పూర్తి చేయాల్సి ఉందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వే పర్యవేక్షణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు హాజరు కావాలని తెలిపారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అనంతరామయ్య, వడ్డెర సంఘ నాయకులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా మాచర్లలో ఈ నెల 16వ తేదీన జరిగే వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని వడ్డే ఓబన్న విగ్రహ కమిటీ చైర్మన్ కొమ్మెర అనంతరామయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని వడ్డెర సంఘ కార్యాలయ ఆవరణలో వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి అధ్యక్షతన గురువారం జరిగిన నియోజకవర్గ వడ్డెర సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అనంతరామయ్య మాట్లాడుతూ సత్తెనపల్లి ప్రాంత వడ్డెర కులస్తులంతా భారీగా తరలివచ్చి ఆ మహోన్నతమైన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వడ్డెర వెల్ఫేర్ బోర్డు జిల్లా మాజీ సభ్యుడు కొమెర వీరాంజనేయులు, కొమెర దుర్గారావు, చల్లా పిచ్చయ్య మాస్టారు, తురకా వీరాస్వామి, పల్లపు ధర్మారావు, ఒంటిపులి నాగేశ్వరరావు, దేవళ్ళ రాంబాబు, బత్తుల శ్రీను, కుంచపు శ్రీను, తమ్మిశెట్టి ఏడుకొండలు, కుంచపు గంగరాజు, తన్నీరు నరసింహారావు, చల్లా అంజి, గుంజి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ 'ఉపాధి' కల్పించాలి



మాచర్ల: ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికి పని కల్పించాలని మండల ఉపాధి గ్రామీణ అధికారి టి.నాగ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల కార్యాలయంలో ఆయన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. వేసవిలో ఉదయం 8 నుంచి 11గంటల వరకు మాత్రమే పనులు చేయాలన్నారు. పనులు మిగిలితే సాయంత్రం 4 నుంచి 6 గంటల సమయంలో కొనసాగించాలని చెప్పారు. ఎండ ప్రభావం కూలీలపై పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చూడాలన్నారు.

పోలీసు విధులపై అవగాహన



మాచర్ల: మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ పోలీసు స్టేషన్‌లో విద్యార్థినులతో ఎస్సై సంధ్యారాణి గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు పోలీసు స్టేషన్‌లో విధుల నిర్వహణ, లాకప్, రిస్పెన్షన్ తదితర అంశాలను వివరించారు. ఎస్సై సంధ్యారాణి మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక చట్టం ఉందన్నారు. ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఆదా



ఏఓ యలమందారెడ్డి, వివిధ శాఖల అధికారులు

కారెంపూడి: ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చులు బాగా తగ్గించుకోవచ్చని, ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి, ప్రకృతి వ్యవసాయం జిల్లా యాంకర్ రామచంద్రం పేర్కొన్నారు. మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో గురువారం ప్రకృతి వ్యవసాయం, దాని అనుబంధ శాఖల అధికారుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఖరీఫ్‌లో వేసే ప్రధాన పంటల సాగుకు ముందు ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ చేయాలని నవ ధాన్యాల పంటలతో పాటు కూరగాయలు, ఆకు కూరలు సేంద్రియ పద్ధతిలో పండించాలని అధికారులు సూచించారు. దీని వల్ల భూమి గుల్ల బారడంతో పాటు భూమి నీటిని నిల్వ చేసుకునే శక్తి పెరుగుతుందన్నారు. చీడపీడల ఉధృతి కూడా కొంత తగ్గి తర్వాత వేసే ప్రధాన పంట ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు. బెంగాల్ గ్రామ్ (బుడ్డ శనగ) సాగు చేయదలుచుకున్న రైతులు ఈ నెలలో సాగు చేపట్టాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు శివకుమార్, మల్లేశ్వరరావు, వీర కుమారి, సుజాత, యాకూబ్, అప్పలరాజు, బాజీబాబు, రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక తిరునాళ్ల

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): గోళ్ళపాడు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. తిరునాళ్లలో భాగంగా తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హనుమద్దీక్ష విరమణ కార్యక్రమం, సామూహిక ఆకు పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం హనుమత్ జ్యోతి దర్శనం చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శతచండీ మహాయాగ అంకురార్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలోని త్రిశక్తి దుర్గా పీఠంలో ఈ నెల 15 వరకు శతాధిక ప్రతిష్టా బ్రహ్మ, దేవి ఉపాసకులు, విశ్వధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి, పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ హనుమత్‌స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహించే పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శతచండీ మహాయాగ అంకురార్పణ గురువారం భక్తిశ్రద్ధలతో జరిగింది. చండీ పారాయణం, శత చండీ హోమం, గురు వందనం, ప్రధాన దేవతార్చన, శత చండీహోమం, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన పూజ, కంకణ ధారణ, రుత్విక్‌వరణం, అఖండ దీపస్థాపన, మాతృకాపూజ, అంకురారోపణ, నవగ్రహ యోగిని వాస్తు క్షేత్రపాలక సహిత సర్వతోభద్ర మండల దేవత ఆవాహనలు, ఆస్థాన పురోహితులు కలవకొలను సీతారామశాస్త్రి నిర్వహించారు.

శ్వేత వైష్ణవి దాల్ మిల్లులో చోరీ



దాల్ మిల్లులో పగలగొట్టిన ఇనుప బీరువా

సత్తెనపల్లి: దాల్ మిల్లులో చోరీ జరిగిన ఘటన పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం ఎదుట గురువారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్వేత వైష్ణవి దాల్ ప్రొడ్యూసర్స్ (జ్యోతిలక్ష్మి దాల్‌మిల్)లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి షట్టర్ తాళాలు పగలగొట్టి స్టోర్ రూమ్‌లో ఉన్న కౌంటర్‌ను ఓపెన్ చేసి రూ.30 వేలు అపహరించారు. అంతేకాక సీసీ ఫుటేజ్, వై ఫై రూటర్ తదితర సామగ్రిని ఎత్తుకెళ్లారు. బీరువా లోపల ఉన్న బాక్సులను పగలగొట్టి ఏమీ దొరకకపోవడంతో వాటిని వదిలేశారు. ఆఫీస్ కౌంటర్ బాక్సును పగలగొట్టి చిందర వందరగా పడేశారు. దాల్ మిల్లు వెనుక పెద్ద షట్టర్‌ను పెద్ద రాడ్లతో మనుషులు వెళ్లే అంత ఎత్తుగా లేపి పగలగొట్టి మిల్లులోకి ప్రవేశించినట్లుగా తెలుస్తోంది. గురువారం దాల్ మిల్లు నిర్వాహకుడు జవ్వాజి రవి మిల్లు ఓపెన్ చేయగా అన్నీ పగలగొట్టి ఉండడాన్ని గమనించి పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్యకు సమాచారం అందించారు. దీంతో పట్టణ పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి గుంటూరు క్లూస్ టీంకు సమాచారం అందించగా క్లూస్ టీం నిశితంగా పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. అక్కడ పని చేసే సిబ్బంది నుంచి ఆధారాలు సేకరించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



4 సెంటర్లు..840 మంది విద్యార్థులు



రెంటచింతల: పదో తరగతి పరీక్షలకు మండల కేంద్రంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో–2 వై.శివనాగేశ్వరరావు గురువారం తెలిపారు. రెంటచింతలలో వివిధ పాఠశాలలకు చెందిన 796 మంది, మరో 44 మంది సప్లమెంటరీ విద్యార్థులు మొత్తం 840 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు వెల్లడించారు. సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలకు 220, వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలకు 210, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు 210, ఫాతిమా విద్యానికేతన్ పాఠశాలకు 200 మంది విద్యార్థులను కేటాయించినట్లు చెప్పారు. కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నామని, విద్యార్థులు ఖచ్చితంగా పరీక్షకు 15 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలని స్పష్టం చేశారు. పరీక్ష సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పరిశ్రమలకు యాజమాన్యం, కార్మికులు రెండు కళ్లు



ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరరావు

సత్రశాల(రెంటచింతల): పరిశ్రమల్లో ప్రతి కార్మికుడు మానసిక ప్రశాంతతతో విధులకు హాజరైనప్పుడు ఏలాంటి ప్రమాదాలు దరిచేరవని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.పరమేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం పరాశక్తి సిమెంట్ కర్మాగారంలో ఫ్యాక్టరీ హెడ్ చీఫ్ జనరల్ మేనేజర్(వర్క్స్) ఎంఎస్ఎన్ రాజు అధ్యక్షతన నిర్వహించిన 54 వ జాతీయ భద్రతా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పరిశ్రమలకు యాజమాన్యం, కార్మికులు రెండు కళ్లలాంటి వారన్నారు.' సమన్వయంతో వ్యవహరించినప్పుడే ప్రమాదాలను నివారించడం జరుగుతుందన్నారు. 1972 నుంచి దేశంలో జాతీయ భద్రతా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. 2006లో ప్రారంభించిన పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్న యాజమాన్యాన్ని అభినందించారు. ముందుగా ఎంఎస్ఎన్ రాజు, అధికారులు కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నర్సరావుపేట ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.రాంబాబు, జీఎం ఎం.రామకృష్ణారెడ్డి, సీనియర్ డీజీఎం ఎ.వెంకట్రావ్, డీజీఎం వీఎల్ గణపతి రాజు, డీజీఎం జి.మల్లికార్జునరావు, సేఫ్టీ ఆఫీసర్ డి.నాగరాజు పాల్గొన్నారు.

సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

పిడుగురాళ్ల: ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై కూటమి ప్రభుత్వం సస్పెన్షన్ ఎత్తి వేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ... ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం సస్పెన్షన్ విధించి, ఏసీబీని ప్రయోగించడంపై అగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం దళిత అధికారిపై ఇలా పగబట్టి వేధింపులకు గురిచేయడం సరికాదని హితవు పలికారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా తమ అధికారాలకు లోబడి పని చేస్తారని, ఎవరికో తొత్తులుగా పనిచేయరని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి పీవీ సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి, గౌరవాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ముందుగా పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏఎం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పాశం శ్యామ్, జిల్లా లీగల్ సెల్ సభ్యులు వెలిశల రామకృష్ణ, కొమ్ము మోషే, చల్లగుండ్ల మరియదాసు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో వేంచేసియున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 83వ వార్షికోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పలకలూరి మల్లయ్య ఆధ్వర్యంలో స్వామికి ఉదయాన్నే ప్రాతఃకాల సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు దైవ దర్శనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయం 9 నుంచి రాత్రి 9గంటల వరకు భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు ప్రభలను, సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు.

తాడుట్ల రెవెన్యూలో రీ-సర్వే ప్రారంభం



అటవీ సరిహద్దును గుర్తిస్తున్న అధికారులు

మాచవరం: మండలంలోని తాడుట్ల రెవెన్యూ పరిధిలో భూముల రీ సర్వే ప్రారంభించినట్లు మండల సర్వేయర్ సాల్మన్‌రాజు తెలిపారు. ముందుగా రెవెన్యూ పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతాన్ని గుర్తించి, హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాడుట్ల రెవెన్యూ పరిధిలో వెల్లంపల్లి, వేమవరం, తురకపాలెం, చెన్నాయపాలెం, మొర్జంపాడు గ్రామాల రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి, బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వీఆర్ఓ నాంచారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ

గురజాల : చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీఐ ఆవుల భాస్కర్ రావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు చాలా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, అటువంటి పరిస్థితుల్లో తెలివిగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అందించే అవకాశాలు, పోలీసులకు ఏ విధంగా సమాచారం ఇవ్వాలి అన్న విషయాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.వినోద్ కుమార్ ఉన్నారు.

